# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 04-12-2015**

సికింద్రాబాద్, నాంపల్లి రైల్వే స్టేషన్లపై ప్రయాణికుల ఒత్తిడి విపరీతంగా పెరిగినందున నగర శివార్లలో మరో రెండు రైల్వే జంక్షన్లను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి శ్రీ కె.చంద్రశేఖర్ రావు కోరారు. ఔటర్ రింగు రోడ్డుకు దగ్గరగా ఉన్న చర్లపల్లి, నాగులపల్లి ప్రాంతాల్లో రైల్వే జంక్షన్లను అభివృద్ధి చేయాలని, దీనికి అవసరమైన అన్ని రకాల సహకారం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని సిఎం చెప్పారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ రవీంద్ర గుప్తా శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా రైల్వే శాఖ - రాష్ట్ర ప్రభుత్వం మధ్యన ఉన్న పలు అంతర్గత విషయాలను చర్చించారు. ఢిల్లీ, చెన్నై తదితర రూట్లకు చర్లపల్లి, ముంబాయి రూట్‌కు నాగులపల్లి రైల్వే జంక్షన్లు అనుకూలంగా ఉంటాయని, ఔటర్ రింగురోడ్డుకు సమీపంలో ఉండడం వల్ల మరింత ఉపయోగకరంగా ఉంటుందని ముఖ్యమంత్రి చెప్పారు. దీనికి రైల్వే జిఎం సానుకూలంగా స్పందించారు. రైల్వే శాఖకు ప్రతిపాదనలు పంపనున్నట్లు వెల్లడించారు.

చర్లపల్లిలో ఇప్పటికే రైల్వే శాఖకు కొంత భూమి ఉందని, దానికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరికొంత భూమిని కేటాయించాలన్న జిఎం ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు.

సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో పేదల గృహ నిర్మాణానికి, ప్రభుత్వ విద్యా సంస్థల స్థాపనకు, ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు స్థలం లేదని, రైల్వే శాఖకు ఉన్న భూమిలో 15 ఎకరాలు ప్రభుత్వానికి కేటాయించాలని ముఖ్యమంత్రి కోరారు. దీనికి బదులుగా మరో చోట రైల్వే శాఖకు భూమి కేటాయిస్తామని కూడా హామినిచ్చారు. దీనికి కూడా జిఎం సానుకూలంగా స్పందించారు. తెలంగాణ వ్యాప్తంగా దాదాపు 150 చోట్ల కాపలాదారులు గాని, గేట్లు గాని లేని లెవల్ క్రాసింగ్‌లు ఉన్నాయని, వాటి వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. గత ఏడాది మాసాయిపేట దుర్ఘటనలో పిల్లలు మరణించడం ఇప్పటికీ బాధ కలిగిస్తున్నదని సిఎం చెప్పారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా వెంటనే గేట్లు

ఏర్పాటు చేయాలని కోరారు. రైల్వే శాఖ ఈ అంశాన్ని ప్రథమ ప్రాధాన్య అంశంగా గుర్తించి దశలవారిగా గేట్లు ఏర్పాటు చేస్తుందని జిఎం హామినిచ్చారు. తుకారాం గేటు వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి పనులను కూడా త్వరగా చేపట్టాలని ముఖ్యమంత్రి కోరారు.

సమావేశంలో మంత్రి పద్మారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌శర్మ, సిఎంఒ ముఖ్య కార్యదర్శి నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

**సిపిఆర్‌ఓ టు సిఎం**